

నిబంధనలకు తూట్లు!

మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి అనుమతి తప్పనిసరి. ఇంటి నంబరు ఆధారంగానే పన్నులు విధిస్తారు.

8లో▸



తండాలో గస్తీ ముమ్మరం

యాలాల మండలం రేళ్లగడ్డతండా పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటంతో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు.

8లో▸



నిర్మించారు.. మరిచారు

దుద్యాల్ మండలంలో గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

8లో▸

న్యూస్‌రీల్

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, బీసీ ఏఎస్‌డబ్ల్యూ అధికారి భీంరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న గీత

మోమిన్‌పేట: జిల్లాలో 2లక్షల పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు వైద్య డిప్యూటీ డైరెక్టర్ సదానందం తెలిపారు. గురువారం మండలంలోని ఎన్కేపల్లిలో పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 60 బృందాలుగా ఏర్పడి 2 లక్షల పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. త్వరలో పశు గణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఏటా రెండు సార్లు ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. టీకా వేయించకపోతే పశువుల ఆరోగ్యం దెబ్బతిని నష్టాలు వస్తాయన్నారు. ప్రతి గ్రామానికి పశు వైద్య సిబ్బంది వచ్చి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. మండలంలోని ఎన్కేపల్లి, ఎన్కతల, చంద్రాయన్‌పల్లి, అంరాధికలాన్ గ్రామాల్లో 813 పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

మర్పల్లి: మర్పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ కార్యదర్శి రఘునందన్ రావు, సహాయ సంచాలకులు ఉదయకుమార్, లక్ష్మీబాయి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ప్రాంతీయ మార్కెటింగ్ ఉప సంచాలకులు ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

అదనపు కలెక్టర్ సుధీర్



పనుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం వికారాబాద్ మండలం మైలారం దేవరాంపల్లిలో సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్ కుమార్, ఎంపీఓ దయానంద్, పీఆర్ డీఈ, ఈఈ పాల్గొన్నారు.

బతుకులు చెల్లాచెదురు

హైదరాబాద్- బీజాపూర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరు, ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి
- మృతులందరూ సమీప బంధువులే
- మేడికొండ, గొంగుపల్లిలో తీరని విషాదం



ప్రమాద స్థలంలో చెల్లా చెదురుగా పడిన మృతదేహాలు



ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్



ప్రవీణ్‌కుమార్(ఫైల్)



నవీన్‌కుమార్(ఫైల్)



హర్షకుమార్(ఫైల్)

పూడూరు: పూడూరు గేట్ వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటన రెండు గ్రామాల్లో తీరని విషాదం నింపింది. చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండ గ్రామానికి చెందిన చిలకమర్రి నవీన్‌కుమార్(21), బుడ్డమోళ్ల హర్షకుమార్(15), ఇదే మండలం గొంగుపల్లికి చెందిన మిట్టకంటి ప్రవీణ్‌కుమార్(20) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై మేడికొండ నుంచి మన్నెగూడకు బయలుదేరారు. వీరిలో హర్షకుమార్ అనంతగిరిపల్లి గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నవీన్‌కుమార్ వికారాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ ఆర్మీ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. వీరిద్దరూ దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. హర్షకుమార్ బుధవారమే హాస్టల్‌కు వెళ్లాల్సి ఉండగా గ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో వాయిదా వేసుకున్నాడు. వీరికి దగ్గరి బంధువైన ప్రవీణ్‌కుమార్ పెళ్లికి హాజరయ్యేందుకు బుధవారం మేడికొండకు వచ్చాడు. మరుసటి రోజైన గురువారం ఉదయాన్నే ప్రవీణ్ తన బైక్‌పై నవీన్‌కుమార్, హర్షకుమార్‌ను మన్నెగూడలో వదిలేసి గొంగుపల్లికి వెళ్తానని చెప్పాడు. దీంతో ముగ్గురూ ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. పూడూరు గేటు దాటుతుండగా ఎదురుగా వస్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్, హర్షకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ఆస్పత్రికి తరలిస్తుండగా నవీన్ మరణించాడు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి మార్చురీకి తరలించారు.

> “రోడ్డుపై ప్రమాదం జరిగిన తీరును బస్సులోనుంచి చూసిన వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదంలో ముగ్గురూ గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడటంతో శరీర అవయవాలు ఎక్కడికక్కడ విరిగిపోయాయి. కళ్ల ఎదుటే జరిగిన ఘటనతో బస్సు ముందు భాగంలో కూర్చున్న వారు ఒక్కసారిగా షాకయ్యారు. చేతికి వచ్చిన పిల్లలను విగత జీవులుగా చూసిన కుటుంబ సభ్యులు గుండెలు బాదుకున్నారు. మేం ఎవరికోసం బతకాలి దేవుడా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ట్రిపుల్ రైడింగ్, అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.”

వ్యవసాయ కుటుంబాలే...

మృతులు ముగ్గురివీ రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలే. దసరా సెలవుల కోసం ఇంటికి వచ్చి, హాస్టల్‌కు వెళ్తున్న హర్షకుమార్, ఆర్మీ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్న నవీన్, అమ్మమ్మవారి గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చిన ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం మూడు కుటుంబాలను పుట్టెడు శోకంలో ముంచింది. బయలుదేరిన పది నిమిషాల్లోనే ప్రమాదం జరిగిందని ఫోన్ రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆశలు ఛిన్నాభిన్నం

మేడికొండకు చెందిన బుడ్డమోళ్ల నర్సింలు, లక్ష్మికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు ఆనంద్‌కుమార్ పరిగిలోని తుంకులగడ్డ హాస్టల్‌లో పదో తరగతి, చిన్న కుమారుడు హర్షకుమార్ వికారాబాద్‌లోని అనంతగిరిపల్లి హాస్టల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన చిల్కమర్రి యాదయ్య, అంజమ్మకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ప్రశాంత్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు ప్రవీణ్ చదువుకుంటున్నాడు. మూడో కొడుకైన నవీన్‌కుమార్ ఆర్మీలో ఉద్యోగం కోసం వికారాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. గొంగుపల్లికి చెందిన రాములు, అలివేలు దంపతులకు ప్రవీణ్‌కుమార్, కావ్య ఇద్దరు సంతానం. ప్రవీణ్ చిన్ననాటి నంచి అమ్మమ్మ (లక్ష్మమ్మ) ఊరైన మేడికొండలోనే ఉన్నాడు. ఈ మధ్యే వివాహం చేసుకుని, భార్య అఖిల, ఏడాది కుమారునితో స్వ గ్రామమైన గొంగుపల్లిలో ఉంటున్నాడు. అనుకోని ప్రమాదంతో కుటుంబ సభ్యులు పెద్దదిక్కును కోల్పోయారు. మృతులందరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన సమీప బంధువులు కావడంతో ఇరు గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

టీఆర్ఆర్, కొప్పుల పరామర్శ

పరిగి: ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో మాట్లాడి మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చేలా ప్రయత్నిస్తామని టీఆర్ఆర్ అన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ప్రమాదం జరిగిన తీరును పరిశీలించేందుకు ఎస్పీ నారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. యాక్సిడెంట్ జరగడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని వివరాలు సేకరించి, సమగ్ర విచారణ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు తదితరులు ఉన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



రోదిస్తున్న బంధువులు



రాజేశ్‌రెడ్డిని సన్మానించి బొకే అందజేస్తున్న స్పీకర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

గ్రంథాలయం పేరును నిలపాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాజేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

అనంతగిరి: జిల్లా గ్రంథాలయం పేరు, ప్రతిష్ఠలకు నిలయమని, వాటిని కాపాడేందుకు కృషి చేస్తూ ముందుకు సాగాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా విద్యకు పెట్టింది పేరని దాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని, గ్రంథాలయ సేవలను అన్ని గ్రామాలకు విస్తరించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వైశ్య ఫెడరేషన్ చైర్మన్ కల్వ సుజాత, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ మంజుల, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మాస్టర్ ప్లాన్

అమృత్ 2.0 పథకం కింద వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల ఎంపిక

- డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులు
- 40 సంవత్సరాలకు ఉపయోగపడేలా ప్లాన్ రూపకల్పన



వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు (ఫైల్)

వికారాబాద్: మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ల తయారీ కోసం ప్రభుత్వం డ్రోన్లను వినియోగిస్తోంది. సమగ్ర సర్వేకు పూనుకున్న సర్కారు ఈ ప్రక్రియను చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని నిర్ణయించింది. 30 నుంచి 40 సంవత్సరాలకు ఉపయోగపడేలా డిజిటల్ మాస్టర్ ప్లాన్ తయారీకి సిద్ధమైంది. రాష్ట్రంలో 50 వేలకు పైగా జనాభా ఉన్న మున్సిపాలిటీలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. 20 మున్సిపాలిటీలు ఎంపిక కాగా జిల్లాలోని వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు చోటు లభించింది. సర్వే ఆఫ్ ఇండియా వారు అధునాతన డ్రోన్ల సాయంతో మాస్టర్ ప్లాన్ కోసం సర్వే చేస్తున్నారు. ముందుగా వికారాబాద్‌లో ఈ ప్రక్రియను చేపట్టారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సర్వేను లాంఛనంగా ప్రారంభించారు.

40 ఏళ్లకు ఉపయోగపడేలా..

మున్సిపాలిటీల పరిధిలో భవిషత్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా.. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా.. నిర్మాణాలు చేపట్టాలన్నా ఈ మాస్టర్ ప్లానే ఆధారం కానుంది. 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా ప్లాన్‌ను తయారు చేస్తున్నారు. డ్రోన్ సర్వేలో మున్సిపాలిటీ ఉపరితలం ఎత్తు, చెరువులు, వాగులు, డ్రైనేజీ, ఇళ్లు, చెట్లు, రోడ్లు, వైకుంఠదామాలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, మార్కెట్లు, సెల్ టవర్లు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకులు, రిజర్వాయర్లు తదితర వనరులన్నింటినీ మ్యాపింగ్ చేస్తారు. అనంతరం 40 సంవత్సరాల అవసరాలకు తగ్గట్టుగా సర్వే ఆఫ్ ఇండియా మాస్టర్ ప్లాన్ తయారు చేసి మున్సిపాలిటీలకు అందజేయనుంది. చాలా సంవత్సరాల క్రితం రూపొందించిన ప్రణాళికలు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మార్చేందుకు కూడా ఈ డిజిటల్ సర్వే ఉపయోగపడనుంది. భవిషత్‌లో మున్సిపాలిటీల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు, అభివృద్ధికి కూడా ఈ డిజిటల్ సర్వే పరిష్కారం చూపుతుందని నిర్వాహకులు అంటున్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపాలిటీలను విడతల వారీగా సమగ్ర అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీకి రూ.12.5 కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో తాగునీటి సరఫరా, తాగునీటి వనరుల అభివృద్ధి కోసం నిధులను వినియోగించనున్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న మాస్టర్ ప్లాన్‌ను ఆధారంగా చేసుకొని భవిషత్‌లో మంజూరయ్యే నిధులతో విడతల వారీగా ఆయా రంగాలను అభివృద్ధి చేయనున్నారు. రానున్న రోజుల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వనరులు, మార్కెట్లు, డంపింగ్ యార్డులు తదితర సదుపాయాలు కల్పించనున్నారు.

క్లుప్తంగా

కుసుమ సాగు చేయాలి



రైతులకు కుసుమ విత్తనాలు అందజేస్తున్న అధికారులు

పూడూరు: రైతులు రబీలో తప్పనిసరిగా కుసుమ పంటను వేసుకోవాలని తాండూరు వ్యవసాయ విత్తన పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కండ్లపల్లిలో కుసుమ పంటపై రైతులకు అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంలో నాణ్యమైన పంట చేతికి వస్తుందన్నారు. కుసుమ పంట పండించడంలో రైతులకు సలహాలు, సూచనలు అందించారు. 15 మంది రైతులు ఉచితంగా కుసుమలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీశైలంగౌడ్, మండల వ్యవసాయ అధికారి తులసీరాం, ఏఈఓ ఇలియాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించండి

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి మిషన్ భగీరథ కార్మికుల వినతి



కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

కొడంగల్ రూరల్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న తమకు కనీస వేతనం అందించాలని కార్మికులు గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నామని, పథకం ప్రారంభం నుంచి పనులు నిర్వహిస్తున్న తమకు కనీస వేతనం అందించాలని కోరారు. కార్మికులకు పెట్రోల్ అలవెన్స్, వీక్లీ ఆఫ్ ఇప్పించాలని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు రాజు, శివకుమార్, కిష్టప్ప, ఆశప్ప, రమేష్‌గౌడ్, హన్మంతు, రవీందర్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో చర్చలు



సిరిగిరిపేట్‌వాసులతో మాట్లాడుతున్న భూ యజమాని

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లో ప్రభుత్వ భూమి కొనుగోలు చేసిన యజమానులు గురువారం గ్రామస్తులతో భేటీ అయ్యారు. గ్రామ శివారులోని సర్వేనంబర్ 109లో 26 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వంలో వేలం నిర్వహించగా కొందరు కొనుగోలు చేశారు. అందులో ఇటీవల హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనాల ప్రకారమే కొనుగోలు చేసినట్లు గ్రామస్తులకు డాక్యుమెంట్లను చూపించారు. స్థానికులు మాత్రం ప్రభుత్వ భూమిని వదిలే ప్రసక్తేలేదని.. ఎలాంటి పనులు చేయొద్దని యజమానిని కోరారు. తన వద్ద అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్నాయని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని యజమాని గ్రామస్తులతో చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి మహిళ మృతి

మీర్‌పేట: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నందనవనం బ్లాక్ నం-34లో నివాసముండే సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, లావణ్య(40)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లావణ్య ఓ పెట్రోల్‌బంకులో పనిచేస్తోంది. గురువారం ఆమె 3వ అంతస్తు బాల్కనీలోని మనీ ప్లాంట్ మొక్కను సరిచేసేందుకు ప్లాస్టిక్ కుర్చీ పైకి ఎక్కింది. ఈ క్రమంలో మొక్కను సరిచేస్తుండగా ఆమె ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు!



తాండూరు మున్సిపల్ కార్యాలయం

- తాండూరులో అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- అక్రమంగా కొనసాగుతున్న ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు
- ఏటా రూ.లక్షల్లో ఆదాయానికి గండి

తాండూరు: మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి అనుమతి తప్పనిసరి. ఇంటి నంబరు ఆధారంగానే ఆస్తి పన్నులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పౌరసేవలు కొనసాగుతాయి. కానీ అలాంటివి లేకుండానే దశాబ్ద కాలంగా తాండూరు మున్సిపల్‌లో నిబంధనలను అతిక్రమించి ఇంటి నిర్మాణాలను, వ్యాపార సముదాయాలను నిర్మించుకొని వ్యాపారాలకు తెరలేపారు. దీంతో మున్సిపాలిటీకి ఏటా రూ.50 లక్షలకు పైగా ఆదాయానికి గండి పడుతోంది. స్థానికంగా నాపరాతి, సుద్ద నిక్షేపాలు ఉండటంతో పాటు సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డుల్లో 14,614 గృహాలున్నాయి. జనాభా మొత్తం 78,008 మంది నివసిస్తున్నారు. ఇళ్ల ద్వారా ఏటా రూ.4.11 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయితే కొందరు మున్సిపల్ పరిధిలో ఉన్న స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు, దుకాణ సముదాయాలు, ఫంక్షన్‌హాల్‌లు, ప్రైవేటు పాఠశాలలను నిర్మించి దశాబ్ద కాలంగా కొనసాగిస్తున్నారు.

ఏళ్లుగా సాగుతున్న వైనం

మున్సిపల్ పరిధిలో కొందరు వ్యాపారులు అనుమతులు లేకుండానే కొన్నేళ్లుగా ఫంక్షన్ హాల్‌లను నడిపిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి ఓ ఫంక్షన్ హాల్‌ను నిర్వహిస్తున్నారు. దానికి ఇప్పటి వరకు మున్సిపల్ అనుమతులు తీసుకోలేదు. మరోవైపు తాండూరు–పెద్దేముల్, తాండూరు–హైదరాబాద్ రోడ్డు మార్గాల్లో ఉన్న ఫంక్షన్ హాల్‌లకు అనుమతులు లేవు. దాదాపు 16 ఫంక్షన్ హాల్ ఉండగా.. అందులో ఎనిమిదింటికి పర్మిషన్లు లేవు. మరోవైపు పలు ప్రైవేటు పాఠశాలలు అసెస్‌మెంట్ లేకుండానే నిర్వహిస్తున్నారని మున్సిపల్ అధికారులు గుర్తించారు.

అనుమతులు లేవు

రెండు వేల ఇళ్లను అసెస్‌మెంట్ చేసుకోకుండానే నిర్మించారు. దీంతో ఆస్తిపన్ను వసూలు చేసే అవకాశం లేకుండా పోయింది. గతంతో మున్సిపాలిటీకి విధులు నిర్వహించిన కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపణలున్నాయి. దీంతో మున్సిపాలిటీకి రూ.50 లక్షల వరకు ఏటా ఆస్తి పన్ను ఆగిపోయింది.

నోటీసులు జారీ చేశాం



మున్సిపల్ పరిధిలో నిర్మించిన వ్యాపార సంస్థల సముదాయాలతో పాటు ఇళ్లను నిర్మించుకున్న వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నోటీసులు జారీ చేశాం. ఇళ్లను నిర్మించుకున్న వారు కొందరు స్పందించారు. కానీ దశాబ్దాలుగా ఫంక్షన్‌హాలలు, ప్రైవేటు స్కూల్‌లను నిర్వహిస్తున్న వారు అనుమతి తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– విక్రమ్‌సింహారెడ్డి, కమిషనర్, తాండూరు

తండాలో గస్తీ ముమ్మరం



అర్ధరాత్రి రేళ్లగడ్డతండాలో ఎస్‌ఐ శంకర్ తదితరుల గస్తీ

- రేళ్లగడ్డతండాలో చిరుత దాడితో ఆందోళనలో స్థానికులు
- చిరుతను బంధించేందుకు ఏర్పాట్లు

యాలాల: మండల పరిధిలోని రేళ్లగడ్డతండా శివారులో కోడెపై చిరుత దాడి చేసి చంపిన ఘటనలో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. తండాతో పాటు పగిడిపల్లి, జుంటుపల్లి, పేర్కంపల్లి, పేర్కంపల్లి తండాల్లో పోలీసులు గస్తీ నిర్వహించారు. తిమ్మాయిపల్లి సెక్షన్ పరిధిలో రిజర్వ్ ఫారెస్టు భారీగా ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు, కాపరులు ఒంటరిగా వెళుతుంటారు. ఈ క్రమంలో యాలాల ఎస్‌ఐ శంకర్ తన సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఒంటరిగా పొలాల వైపు వెళ్లరాదని సూచించారు. అర్ధరాత్రి వేళ రేళ్లగడ్డతండాలో పోలీసులు పహారా కాశారు.

సీసీ కెమెరాలతో నిఘా!

రేళ్లగడ్డతండాలో కోడెదూడపై చిరుత దాడి చేసి చంపిన ఘటన అనంతరం పలు ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు. కాగా గురువారం వరకు సీసీ కెమెరాల్లో చిరుత ఆచూకీ నమోదు కాలేదన్నారు.

పటేల్‌చింత తండా శివారులో పాదముద్రలు!

యాలాల: మండల పరిధిలోని రేళ్లగడ్డతండాలో కోడె దూడపై దాడి చేసి చంపిన చిరుతపులి విషయంలో తండావాసులు ఆందోళన చెందుతున్నారు. కాగా గురువారం ఉదయం జుంటుపల్లి ప్రాజెక్టు ఎగువన, పటేల్‌చింత తండా సమీపంలో చిరుత పాదముద్రలను తండావాసులు గుర్తించారు. వాటి ఫొటోలను అటవీ శాఖ అధికారులకు వాట్సాప్ ద్వారా పంపించి పరిశీలించాల్సిందిగా స్థానిక యువకులు కోరారు. రేళ్లగడ్డతండా, పగిడిపల్లి రైతులు తమ పొలాల వద్ద టపాసులు కాల్చుతున్నారు. రేళ్లగడ్డతండా అనుబంధ తండా అయిన పటేల్‌చింతతండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తండాకు వెళ్లేందుకు దారి మధ్యలో ఉన్న అన్నారం వాగును దాటేందుకు అధికారులెవరూ ముందుకు రావడం లేదని తండావాసులు వాపోతున్నారు.



గుర్తించిన పాదముద్రలు

ఎమ్మెల్యే సోదరుడికి ఎస్కార్ట్!

బషీరాబాద్ పోలీసుల వింత ధోరణి

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి బషీరాబాద్ పోలీసులు ఎస్కార్టు పెట్టడం తీవ్ర విమర్శలకు దారితీసింది. గురువారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి తాండూరు నుంచి భారీ వాహనశ్రేణితో బయలుదేరిన శ్రీనివాస్‌రెడ్డి బషీరాబాద్ రైల్వేగేటు పడడంతో ఆగిపోయాయి. ఎమ్మెల్యే సోదరుడిని రిసీవ్ చేసుకోవడానికి ఏఎస్‌ఐ నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఎస్కార్టు వాహనంతో గేటుకు అవతలివైపు వేచి ఉన్నారు. రైలు వెళ్లిన తర్వాత పోలీస్ వాహనం ఎస్కార్టుగా శ్రీనివాస్‌రెడ్డి కాన్వాయ్‌ని తీసుకువెళ్లారు. అదే సమయంలో కాన్వాయ్‌కు ముందు ఎస్‌ఐ గఫార్ తన సొంత వాహనంలో వెళుతున్నాడు. మీడియా ప్రతినిధులను గమనించిన ఎస్‌ఐ గఫార్ పోలీస్ వాహనాన్ని కాన్వాయ్ నుంచి వెనక్కి తప్పించారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే సోదరుడికి ఏ హోదాలో పోలీసులు ఎస్కార్టు కల్పించారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల నాయకులు మండిపడ్డారు. రైల్వే గేటు పడటంతో తమ వాహనాల ఎదుట పోలీసు వాహనం వచ్చిందని కాంగ్రెస్ నాయకుడొకరు తెలిపారు.



శ్రీనివాస్‌రెడ్డి కారు వెనకాల వెళుతున్న ఎస్కార్టు వాహనం

ఎమ్మెల్యే వస్తున్నారనుకొని..

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బషీరాబాద్ పర్యటనకు వస్తున్నారన్న సమాచారంతో పోలీసు వాహనాన్ని పంపించాం. తీరా ఎమ్మెల్యే సోదరుడు వచ్చారని తెలియడంతో ఎస్కార్ట్ వాహనాన్ని వెనక్కి పంపించాం. ఇందులో ఎలాంటి ఉద్దేశం పోలీసులకు లేదు.

– గఫార్, ఎస్‌ఐ

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నవాబుపేట: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో గంగ్యాడ గ్రామానికి చెందిన మాదిగ అనిల్ కుమార్ ఈ నెల 4న అదే గ్రామానికి చెందిన ఊరకుర్వ వెంకటయ్య ఇంట్లోకి చొరబడి, 3తులాల బంగారం అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనిల్‌పై అనుమానం కలగడంతో తమదైన శైలిలో విచారించగా.. దొంగతనం తానే చేశానని అంగీకరించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, గురువారం రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పశువులకు గడ్డి కోస్తుండగా ఘటన



పాండునాయక్ (ఫైల్)

దుద్యాల్: పశువులకు గడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రోటిబండతండాలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాండు నాయక్(61) పశువులకు మేత కోసేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ కింద ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా పచ్చి గడ్డిని కోస్తున్నాడు. ఈ క్రమంలో కొడవలి విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య సోనిబాయి, ఇద్దరు కూతుళ్లు, కుమారులు ఉన్నారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీలో భాగంగా పాండునాయక్‌కు ఉన్న దాదాపు 5 ఎకరాల భూమి కోల్పోతున్నాడు. ఇదే విషయమై కొద్ది రోజులుగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఫార్మా ఏర్పాటు వ్యతిరేక పోరాటంలో అత్యంత చురుగ్గా పాల్గొన్నాడని స్థానికులు తెలిపారు.

అర్ధరాత్రి దుకాణాల్లో చోరీ

శంకర్‌పల్లి: పట్టణంలోని రెండు దుకాణాల్లో షెట్టర్ తాళాలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైష్ణవి హార్డ్‌వేర్, సంగమేశ్వర ఎంటర్‌ప్రైజెస్ దుకాణాల్లో దొంగలు పడి కొంత నగదు అపహరించుకెళ్లారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



అడిషనల్ సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు రూరల్: మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను 2024 జనవరి నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. అయితే మినీ అంగన్ వాడీలకు ఐదు నెలలుగా వేతనం రూ.7,800 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అదే విధంగా మినీ అంగన్‌వాడీల్లో హెల్పర్లను కూడా కేటాయించాలని కోరారు. హెల్పర్లు లేకపోవడంతో మినీ అంగన్‌వాడీలు వెట్టిచాకిరీకి కేంద్రంగా మారాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ డివిజన్ నాయకుడు బుగ్గప్ప, అంగన్‌వాడీలు బేబీరాణి, ప్రమీల, లలిత, మంగ్లీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

లింగన్నపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకం



తవ్వేందుకు పూజలు చేసిన ప్రాంతం



ఘటనాస్థలంలో విచారిస్తున్న పోలీసులు

గ్రామస్తుల రాకతో పరారైన దుండగులు

కుల్కచర్ల: లింగన్నపల్లిలో గుప్తనిధుల తవ్వకం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌడాపూర్ మండలం లింగన్నపల్లి గ్రామ శివారులో గురువారం ఉదయం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కొంతభాగం తవ్వి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దగా శబ్దాలు రావడాన్ని గమనించిన గ్రామస్తులు కొందరు.. అటుగా వెళ్లారు. వీరి రాకను గమనించిన నిర్వాహకులు పారిపోయారు. అనంతరం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించారు. ఎవరూ ఎలాంటి భయాందోళనకు గురికావద్దని సూచించారు. తవ్వకాలకు కారకులైన వారిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

సీతాఫలం.. ఉపాధి ఘనం



పెద్దేముల్‌లో తాండూరు-హైదరాబాద్ రహదారిపై సీతాఫలాల విక్రయం

పెద్దేముల్: రోడ్డు పక్కనే నోరూరించే సీతాఫలాలను చూసి వాహనదారులు ఆగి రుచి చూస్తున్నారు. గత నెల రోజులుగా మండలంలోని తాండూరు–హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరుగుతున్న తీరిది. ప్రస్తుతం సీతాఫలాలు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాయి. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు తమకు ఉపాధి ఇస్తుందని మండలంలోని దుగ్గాపూర్, మన్‌సాన్‌పల్లి, తట్టిపల్లి, మారేపల్లి తండా, రుక్మాపూర్, కొండాపూర్‌తో పాటు పలు గ్రామాల కూలీలు అంటున్నారు. తాండూరు–హైదరాబాద్, జహీరాబాద్–తాండూరు, సంగారెడ్డి– తాండూరు ప్రధాన రాహదారులపై విక్రయాలు సాగిస్తున్నారు. వ్యాపారం సక్రమంగా జరిగితే రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వస్తుందని అంటున్నారు. రుక్మాపూర్, చైతన్యనగర్, రెగోండితో పాటు పలు గ్రామాలకు చెందిన కూలీలు ఉదయం రుక్మాపూర్, తాండూరు రైల్వే స్టేషన్‌లలో విక్రయిస్తుంటారు. అటు వ్యవసాయ పనులు లేక, ఇటు ఉపాధి అందక ఏదో ఓ వ్యాపారం చేసుకొని పూట గడుపుతున్నామని చెబుతున్నారు. ఉదయం 6 గంటలకు అడవుల్లోకి వెళ్లి కాయలు తీసుకొచ్చి వ్యాపారం చేస్తుంటారు. కొంత మంది భర్తలు కాయలను తీసుకురాగ, భార్యలు విక్రయిస్తుంటారు. సుమారు మూడు నెలల ఉపాధి కలుగుతుందని మండలంలోని కూలీలు పేర్కొంటున్నారు.

పీఎస్‌కు చేరిన పైసల లొల్లి



పోలీస్ స్టేషన్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న దేవీబాయి



దేవీబాయిని అడ్డుకుంటున్న పోలీసులు

- ఠాణాలో ఒంటిపై కిరోసిన్ పోసుకున్న మహిళ
- పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

బషీరాబాద్: ఏ దిక్కూ లేని తనకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని ఓ తండాకు చెందిన మహిళ గురువారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గిరిజన మహిళ దేవీబాయి భర్త ప్రమాదంలో చనిపోవడంతో కూలీనాలి చేసుకుని పిల్లలను పోషిస్తోంది. తండ్రి లేని బిడ్డకు మంచి సంబంధం చూడాలనే తపనతో కట్నకానుకలకు వెనకాడకుండా.. కష్టాలకు ఓర్చి పెద్ద కూతురు వివాహాన్ని ఘనంగా చేసింది. సీన్ కట్ చేస్తే.. నాలుగు నెలలు తిరగక ముందే కూతురు.. పక్క తండాకు చెందిన మరో యువకుడితో పారిపోయి, పెళ్లి చేసుకుంది. ఈ విషయమై అప్పట్లో మిస్సింగ్ కేసు సైతం నమోదైంది. పోలీసులు యువతి, యువకుడిని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూడు కుటుంబాల వారు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పెళ్లి ఖర్చుల కింద తనకు రూ.11 లక్షలు చెల్లించాలని మొదటి పెళ్లికొడుకు డిమాండ్ చేయడంతో.. పెద్ద మనుషులు దీన్ని సమ్మతించారు. దీనికి తోడు ఖర్చులు భరించి వివాహం చేసిన దేవీబాయికి సైతం రూ.3 లక్షలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మొత్తాన్ని రెండో పెళ్లి కొడుకైన కంసాన్‌పల్లి తండాకు చెందిన వినోద్ చౌహాన్ చెల్లించాలని ఒప్పందపత్రం రాసుకున్నారు. సదరు యువకుడు, అతని కుటుంబ సభ్యులు అక్టోబర్ 27లోపు డబ్బులు చెల్లిస్తామని రాసిచ్చారు. ఇదిలా ఉండగా గడువు సమీపిస్తుండటంతో మొదటి పెళ్లి కొడుకు, అతని కుటుంబ సభ్యులు దేవీబాయి ఇంటికి వెళ్లి డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఒప్పదం ప్రకారం సమయానికి డబ్బు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ముందు అంగీకరించిన వినోద్, అతని కుటుంబ సభ్యులు ప్రస్తుతం డబ్బులు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో అంతా కలిసి గురువారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అయితే ఇది తమ పరిధిలోని వ్యవహారం కాదని, మీరే తేల్చుకోవాలని ఎస్‌ఐ గఫార్ వారికి సూచించారు. దీంతో మొదటి పెళ్లి కొడుకు తరఫున వారికి ఒప్పుకున్న రూ.11 లక్షలు తాను ఎక్కడి నుంచి తేవాలని ఆందోళన చెందిన దేవీబాయి వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. చివరకు ఒప్పుకొన్న డబ్బులు చెల్లించేందుకు వినోద్ చౌహాన్ కుటుంబం అంగీకరించడంతో వ్యవహారం సద్దుమణిగింది.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు



ప్రారంభానికి నోచుకోని రోటిబండ తండా గ్రామ పంచాయతీ భవనం



ప్రస్తుతం కొనసాగుతున్న జీపీ కార్యాలయం

- నిరుపయోగంగా గ్రామ పంచాయతీ భవనాలు
- వినియోగంలోకి తేవాలని స్థానికుల డిమాండ్

దుద్యాల్: గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జీపీలకు సొంత భవనాలు లేక పాలనకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో మండలంలో కొన్ని గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాత్కాలికంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని రోటిబండ తండా, లగచెర్ల గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం రూ.20 లక్షల వ్యయంతో ఈ భవనాలను మంజూరు చేసింది. వీటిని నిర్మించి దాదాపు ఐదు నెలలు అవుతుందని కాంట్రాక్టర్లు, ఆయా గ్రామస్తులు తెలుపుతున్నారు. రెండు గ్రామాల్లో పంచాయతీ భవనాలకు ఒక్కో దానికి రూ.20 లక్షలు వెచ్చించారు. నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉండడంతో వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రోటిబండ తండాలో గ్రామ పంచాయతీ భవన లేకపోవడంతో తాత్కాలికంగా రేకుల గదులను నిర్మించి ఒకదానిలో అంగన్‌వాడీ కేంద్రం, మరో గదిలో గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్నారు. లగచెర్లలో గ్రామ పంచాయతీ పాత భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో కార్యకలాపాలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మించిన భవనాలకు బిల్లులు మంజూరు కాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తుంది. సమస్యను పరిష్కరించి భవనాలను ప్రారంభించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.